సంధ్యా సమయం. భానుడు తన పని ముగించుకుని పడమటి దిశగా గమ్యానికి చేరుకుంటున్నాడు. ప్రశాంతమైన తన చల్లని కాంతిని పెడజల్లడానికి వస్తున్నాడా అన్నట్లుంది చంద్రబింబం. నా మనస్సు ఉదయంనుండీ జరిగిన విషయాలను నెమరు వేసుకుంటూ అలా అలా వినువీధిలో విహరిస్తోంది.

ఇంతలో తలుపు తెరచిన శబ్దంవిని అటుగా చూశాను. అప్పుడే విచ్చుకుంటున్న గులాబి మొగ్గలా పదునాలుగేళ్ళ కన్య దీనవదనంతో "అమ్మగారూ" అంది. విని వినిపించని మంద్రస్థాయిలో. అప్పటి వరకూ నన్ను అమ్మాయిగారూ అన్నవారేకాని, అమ్మగారు అన్న శబ్దం ప్రయోగించగా వినని నా వీనులు ఆశ్చర్యాన్నే పొందాయి. "ఏమ్మా ! ఏం కావాలి. రా, లోపలికి వచ్చి ఇలా కూర్చో" అన్నాను. బెరుకు బెరుకుగా నా దగ్గరకొచ్చి కూర్చుంది.

ఇదేమియమ్మా? *అమంచర్ల

"ఈ రాత్రికి మీ యింట్లో వుండనిస్తారా! మా స్నేహితురాలు ప్రభురని చూద్దామని వచ్చాను. తన యిల్లు యీ చీకటిలో వెతుక్కోలేనేమోనని భయంగా వుంది. యీ పూటకి నన్ను యిక్కడ వుండనిస్తే పొద్దున్నే లేచి తన దగ్గరికి వెళ్ళిపోతాను" అంది.

నాకేమీ పాలుపోలేదు. ఆ అమ్మాయి ముఖంచూస్తే మర్యాద గల పెద్దింటి అమ్మాయి అనిపించింది. కానీ. ఆ అమ్మాయి అడిగే తీరు అనుమానాస్పదంగా వుంది. 'ఎందుకు స్నేహితురాలి దగ్గరకి వంటరిగా వచ్చింది' అన్న అనుమానం నన్ను పీడించసాగింది.

"మీ స్నేహితురాలి పేరేమిటి. వాళ్ళ అడ్రసు ఏమిటి" అని అడిగాను.

"ఆ అమ్మాయి పేరు ప్రభుర. వాళ్ళ అడ్రసు సరిగా గుర్తు లేదు. తనూ నేను మా వూళ్ళో నాలుగవ తరగతిదాకా కల్సి చదువుకున్నాము. వాళ్ళ నాన్నగార్కి ట్రాన్స్ఫర్ అవటంతో యీ వూరు వచ్చేశారు. తనను చూద్దామని వచ్చాను."

"అసలు మీ వూరు ఏది. ఎప్పుడు బయలుదేరావు. అడ్రసు తెలియకుండా ఎందుకు వంటరిగా వచ్చావు" అని కొంచెం కటువుగా ప్రశ్నించాను. ఇంతలో పక్కింటి ప్రభావతిగారు వచ్చి "సినిమాకు వెళ్దామా లతా" అంటూ ఆ అమ్మాయిని చూసి. "ఈ పిల్ల ఎవరు" అన్నారు. ఆ అమ్మాయి చెప్పిన విషయమే చెప్పాను. ప్రభావతిగారు వెంటనే అందుకుని, "ఇలాంటివాళ్ళని జాలిదల్చి యింట్లో చేర్చకూడదు. పట్టుమని పధ్నాలుగేళ్ళు లేవు. స్నేహితురాలి అడ్రసు తెలియకుండా ఆ అమ్మాయిని చూడటానికి ఎందుకు వచ్చింది?" అని నాతో అని. ఆ అమ్మాయికేసి తిరిగి. "మీ నాన్నగారి పేరేమిటి,ఆయన ఏం ఉద్యోగం చేస్తున్నారు? అసలు యిల్లు వదిలి ఎందుకు వచ్చావు. ఎక్కడా ఏమీ ఎత్తుకు రాలేదు కదా! మీ వాళ్ళకి చెప్పే వచ్చావా" అంటూ నిలదీసి అడిగారు.

దాంతో ఆ అమ్మాయికి దడవచ్చి బిక్కమొహం వేసుకొని "నేను పరీక్ష ఫెయిల్ అయ్యానని యింట్లో తిట్టారు. కోపమొచ్చి బయట ఏమైనా పని చేసుకుని బ్రతుకుదామని వచ్చేశాను" అంది. అది విన్న నాకు జాలి. కోపం. నవ్వు. బాధ ఒకేసారి పెల్లుబికి వచ్చాయి. ఈ మాటలు. గందరగోళం విని మేడమీద మాణిక్యమ్మగారు. వారి అబ్బాయి దిగి వచ్చారు. జరిగిన సంగతంతా విని. "పోలీసు స్టేషన్‌లో అప్పగిస్తేసరి. యిలాటి వాళ్ళని రోగాలు కుదురుతాయి.ఇంట్లో తిండిపెట్టే అమ్మా. నాన్నా కేకలేస్తే అంత పౌరుషమా! చిన్నప్పటి నుండి పెంచి పెద్దచేసినవాళ్ళు. కాస్త మాటంటే యిల్లు వదిలేసి రావడమేనా! వెధవ సినిమాలు చూసి యిలా తయారవుతున్నారు." అని మాణిక్యమ్మగారు వాళ్ళ అబ్బాయితో. "ఈ పిల్లని వాళ్ళ వూళ్ళో దింపితే సరిపోతుంది. ఎన్నాళ్ళని ఎవరింట్లో వుంటుంది. ఈడొచ్చిన పిల్ల. తల్లి

దండ్రులు మాటంటేనే సహించలేనిది యితరుల యిళ్ళలో ఎలా వుంటుంది. ఇలాంటివాళ్ళని ఏం చేసినా పాపంలేదు" అన్నారు గట్టిగా. ఆవిడ గదమాయింపు విన్న ఆ పిల్ల "నేను వెళ్ళనండి. మీకు వీలైతే యీ రాత్రికి ఆశ్రయమివ్వండి. అంతేగాని. మిగతా విషయాలు మీకు అనవసరం" అని కాస్త పౌరుషంగానే సమాధానమిచ్చింది. నేనలా ఆ పిల్లకేసి. వాళ్ళకేసి చూస్తూ కూర్చున్నాను.

ఈహడావిడంతా వెనక రోడ్డులోకి పాకింది. వెంటనే వెనక రోడ్డు వెంకటలక్ష్మిగారు వంటచేస్తూ పైకి పెట్టుకున్న కుచ్చెళ్ళు దించటానికి టైము లేదేమో-అలాగే వగర్చుకుంటూ వచ్చారు. ఆమెను చూసేసరికి నాకు కాస్త భయంవేసింది. "లతా! నీకేమైనా మతిపోయిందా! ఇలాంటివాళ్ళను చేరదీస్తే నీ పరువూ. మర్యాదా మంట కలుస్తాయి. వెంటనే పొమ్మనక యీ సంజాయిషీలు. చర్చలు నీకెందుకు? ఇలాంటివాళ్ళు నంగనాచిలా వచ్చి మనింటి కూపీలాగి అవతలవాళ్ళకి చారేస్తారు. ఇప్పుడు జరిగే దొంగతనాలు. దోపిడీలు యిలాంటివాళ్ళ వల్లనే. దాని మొహం చూస్తేనే తెలుస్తోంది. పంపించెయ్యి. లేకపోతే పోలీసు స్టేషన్‌లో అప్పచెప్పమను" అని ఆమె వాగ్ధాటిని గుక్కతిప్పుకోకుండా ప్రదర్శించారు. ఇంకో ఇద్దరు బామ్మగార్లు వచ్చి. "ఈ అమ్మాయిని ఆ మధ్య ఎక్కడో చూసినట్టున్నామే" అన్నారు. ఇంతకీ అసలు ఏ అఘాయిత్యపు పనిచేసి యిక్కడికి చేరిందో నిలదీసి అడగండి అదే చెబుతుంది" అని ఓ ఉచితసలహా పారేసి వెళ్ళారు. ఆ అమ్మాయి మనసు వీళ్ళందరినీ చూసి ఎలావుందోకాని నేను మాత్రం. యిదేమిటా. ఏం చేయాలా అని ఆలోచిస్తూ వున్నాను. ముఖం చూస్తే పసితనపు ఛాయలు యింకా వదిలినట్లులేదు. వీళ్ళందరినీ చూసి ఆ అమ్మాయి కళ్ళలో భయం. ఉక్రోషం కాట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. వారందరినీ గుడప్పజెప్పి అలా చూస్తోంది. టైమ్ చూసుకున్నా—తొమ్మిది గంటలవుతోంది. జనాలు పెరుగుతున్నారేగాని తరగటంలేదు.

నేనే నెమ్మదిగా లేచి "సరే. పోలీసు రిపోర్టు యిద్దాం. లేకపోతే ఎలా పాపం. ఆ అమ్మాయి భయపడుతోంది" అన్నాను. దాంతో ముందుగా వచ్చిన మహిళామణులందరూ ఒకరి తరువాత ఒకరు యిళ్ళకు వెళ్ళారు. చివరికి నేను. ఆ పిల్ల. ఇద్దరు మేడమీదివారి పిల్లలూ మిగిలాము. నాకు మాత్రం ఆ అమ్మాయికి ఆ రాత్రికి ఆశ్రయమిచ్చి కాపాడాలనే వుద్దేశ్యం. నా యింట్లో మాత్రం ఎవరున్నారు? వీళ్ళందరి మాటలూ నాలో ప్రతిధ్వనిస్తున్నాయి. 'ఉపకారానికి వెడితే అపకారం ఎదురొస్తుందేమో. కొందరు అనుభవజ్ఞులైన పెద్దలన్నట్లు ఎవరైనా ముఠావాళ్ళు యీ అమ్మాయిని పంపారేమో. నాకు మంచి నిద్ర పట్టగా చూసి అందినవి చేత పట్టుకుపోతే! అంతటితో వదిల్తే ఫరవాలేదు. కానీ తలుపులు తెరచి ఆమె తాలూకు ముఠా యింట్లో ప్రవేశిస్తే నాగతేం కాను? ఇలా నా మనసు పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది. చివరికి దృఢనిశ్చయంతో ఆ లేత వయసు అమ్మాయికి ఆశ్రయమివ్వటానికే సిద్ధపడ్డాను. మిగిలిన మేడమీది పిల్లలు వాసు. షీలని "ఈ రాత్రి మా యింట్లోనే పడుకోండి" అని చెప్పాను. వాళ్ళు సరే అన్నారు. ఈలోగా ఆ అమ్మాయిని దొడ్లోకి వెళ్ళి. కాళ్ళు. చేతులు. ముఖం కడుక్కుని రమ్మన్నాను. అలాగే చేసి వచ్చింది. నేను చేసిన అతిథి సత్కారానికి నాలో నేను సిగ్గుపడి. "మంచినీళ్ళు కావాలామ్మా" అని అడిగాను. పాపం రెండు గ్లాసుల నీళ్ళు గడగడ త్రాగింది. ఈ హడావిడంతా చూశాక నాకు కాళ్ళాడలేదు. నీరసం పట్టుకుంది. నాకు మా పనమ్మాయికి వండిన అన్నం. కూర. వున్నాయి. మళ్ళీ ఏం చేయాలన్నా నాకు బద్ధకం వేసింది.

సరే. ఆ అమ్మాయికి ఆకువేసి "వచ్చి భోజనం చెయ్యి" అన్నాను. బెదురుగానే ఆ పిల్ల, విస్తరి ముందు కూర్చోకుండా "మీరు తినండి తరువాత మిగిలింది నేను తింటాను" అంది.

నాకు కళ్ళంట నీరు కారాయి. అనుభవాలే నేర్పుతాయి జీవిత పాఠాలు.పాపం తల్లిదాటున బతికే యీ పిల్ల అమ్మ అన్నీ అమర్చిపెడితే ముద్దులు గుడుస్తూ తినే యీ చిన్నారికి యీ చిన్ని సంఘటనే కొంత అనుభవాన్ని నేర్పింది. "లేదు. నువ్వు తిను పాపా తరువాత నేతింటాలే. ఏమీ ఫరవాలేదు. నేను చూసుకుంటాలే నీ సంగతి. కంగారు పడకు. అన్నం తిని. రేపు పగలు మీ స్నేహితురాలి యిల్లు వెతుకుదాంలే" అన్నాను. నాకు చేతనయిన హామీ యిస్తూ. ఇంతవరకు యీ మాత్రం ఆప్యాయత కైనా నోచుకోని ఆ అమ్మాయికి నా మాటలు బహుశా వన్నీరు చిలకరించినట్లయ్యాయేమో ఆ పిల్ల"మీరు కూర్చోండమ్మా"అని ఎంతో అభిమానంతో తనకు వేసిన పీట నాకు వేసింది.

ఇద్దరమూ కలిసి భోజనం చేశాక అరటి పండు ఆ పాప కిచ్చి నేనొకటి తిన్నాను. అప్పటికే ఆ పాప మనసు కాస్త తేలిక పడింది. అన్నింటికీ తాళాలు వేసి ఆ గుత్తి నా కొంగుకి కట్టుకుని తనకు, నాకు పై పిల్లలకి చాపలు పరచి దిండ్లు వేశాను. అప్పటికే టైము పదకొండు దాటింది. వాసూ. వాళ్ళు గుర్రు పెట్టి నిద్రపోయారు. నాకు ఏ మాత్రం నిద్ర రావటం లేదు. పాప కూడా అటూ ఇటూ కదుల్తూనే వుంది. ఈ పాప విషయంలో తెల్లవారాక నేను ఏం చేయాలన్నదే నా సమస్య. 'పాప తల్లి దండ్రులు ఎంత బాధ పడుతున్నారో యీ పిల్ల తెలివి తక్కువ తనాన్కి. 'తల్లిని మించిన చల్లని దైవం ధాయణి వేరే లేదుగా' అన్నట్లు తల్లి పొట్టకట్టుకునైనా పిల్లల్ని పెంచుతుందే.ఆ మాత్రం అర్థం కాక యీ చిన్నారి యిల్లు వదిలేసింది. పాపకేసి ఓ సారి చూశాను. నిర్మలంగా నిద్రపోతోంది. బయట సినిమా జనం పిజిల్స్, కామెంట్స్, రిక్షా గంటల శబ్దాలు. టైము చూస్తే ఒంటి గంట అయింది. 'తిండి లేకపోయినా సినిమా మోజు జనాలకి. వెళ్ళినా- అందులో మంచిని గ్రహించేవారు తక్కువ. పిల్లలు సినిమాలో పెద్దలను ఎదిరించారు. మనమెందుకు ఎదిరించ కూడదు. తిండికి లేదని దొంగతనం చేశాడు. సుఖపడ్తున్నాడు. తిండికి లేదని కూచుంటే వస్తుందా ! డబ్బు సంపాదనకు దొంగ తనం ఒక మార్గమేగా !'ఇలా ఆలోచిస్తుంటాయి వసి మనసులు. సాయంత్రం వచ్చిన అమ్మలక్కల మాటలు విని నేను యీ పిల్లల ఏ పోలీసు స్టేషనులోనో అప్పగిస్తే యీ పాప బ్రతుకు తారుమారయ్యేదేమో!లేక నాకెందుకులే యీ పాప గొడవ అని వదిలించుకోకపోతే యీమె ఏ రౌడీల చేతిలో నన్నా చిక్కి పెనం లోంచి పొయ్యిలో పడ్డట్లయేదేమో యీమె జీవితం! తల్లి అన్న చిన్న మాటకే కష్టపెట్టుకున్న యీ చిన్నారి మనసు. లోకం పెట్టే కష్టాలను ఒంటరిగా ఎదుర్కొనగలదా.' ఏమైనా సరే తెల్లవారాక వాళ్ళ అడ్రసు నెమ్మదిగా అడిగి ఆమె తల్లి తండ్రులకు అప్పజెప్పడమే నా విధిగా నిశ్చయించుకున్నాను. ఇలా ఆలోచిస్తూ ఎప్పుడు నిద్రలోకి జారిపోయానో నాకే తెలియదు. మగతలో ఎక్కడో తలుపు తట్టినట్లు శబ్దం వినిపించింది."తలుపు తెరవద్దు" అని గట్టిగా కేక వేశాను. వాసూ వాళ్ళు "ఆంటీ. ఆంటీ లేవండి తెల్లవారింది. పాలమ్మాయి తలుపు తడుతోంది" అని లేపారు. నేను తృళ్ళి పడి లేచాను. ఆతృతగా పక్కకి తిరిగి చూశాను. పాప అదమర్చి నిద్రపోతోంది పాపం. లేపి కాఫీ పెట్టాను. "నువ్వు పాలు తాగుతావా. కాఫీ తాగుతావా" అని అడిగాను. ముఖం అదోలా పెట్టింది. కానీ కళ్ళంట నీళ్ళు కారుతున్నాయి. ఒక గ్లాసు పాలు. ఒక గ్లాసులో కాఫీ పోసుకుని పాప దగ్గరగా వెళ్ళి"పాలు తాగు. నీకెందుకు భయం!నేను చూసుకుంటాను" అని అన్నానుగా. నీకు మీ అమ్మ- యిల్లు గుర్తుకు వచ్చాయా ! మీ యింటికి తీసుకు వెళ్ళనా" అని బుజ్జగించగా నెమ్మదిగా తన తండ్రి పేరు. అడ్రసు చెప్పింది.

కాలేజీకి శెలవు చీటీ పంపి వంట చేసుకుని పాప, నేను భోజనం చేశాము. "మా నాన్నగారు కొడ్తారండీ" అంది.

"మీ వాళ్లు ఏమీ అనకుండా నేను చెబ్తాసుగా" అని ధైర్యం చెప్పి మా యింటికి తాళం పెట్టి బస్ స్టాండ్‌కు వెళ్ళాం. నిడదవోలు బస్సు రెడీగా వుంది. మధ్యాహ్నం మూడు గంటలైంది వాళ్ళయింటికి చేరేసరికి. పాపని. నన్నూ చూసిన పది సంవత్సరాల పిల్లవాడు ఒక్క గెంతులో ఇంట్లోకెళ్ళాడు. అరుచుకుంటూ. మేము గుమ్మంలో అడుగుపెట్టేసరికి యాభై సంవత్సరాల స్త్రీ "తల్లీ వచ్చావా" అంటా పాపని వాటేసుకుంది. పాప "అమ్మా" అంటూ బావురుమంది. అరడజను మంది చుట్టూ వున్నవారు పరిగెత్తుకు వచ్చారు. పది నిమిషాలు అయ్యాక ఆ పాప తల్లి తేరుకుని నన్ను కూర్చోమని. "నాకు పుత్రికభిక్ష పెట్టిన దేవత మీరు" అంటూ తన సంతోషాన్ని వెలిబుచ్చింది. ఆ పాప ఇల్లు వదిలినప్పటి నుంచి ఆమె మంచి నీళ్లు ముట్టలేదట. తెలిసిన తావులన్నీ వెతికి పాప దొరకదని నిరాశ చెందారు. పాపను చూసిన తండ్రి "యీ రోజుల్లో యీదొచ్చిన పిల్లల్ని కఠినంగా ఏ మాటా అనకూడద"ని నాతో అంటూ పాపని దగ్గరకు తీసుకున్నాడు. జీవితంలో ఎన్నడూ ఎరుగని తృప్తి. ఆనందం నాకు ఆ క్షణంలో కలిగాయి.

ఈ మాటల కందని మధురానుభూతి స్వయంగా అనుభవించిన వారికే అర్థమౌతుందిగాని, ఊహించడానికి శక్యం కాదు. నా జీవితంలో నేనొక మంచి పని చేయగలిగినానన్న సంతోషంతో నా యిల్లు చేరుకున్నాను.

వనితా జ్యోతి

సచిత్ర మాసపత్రిక

వనితాభ్యుదయానికి
అత్యున్నత రాజపథం
'వనితాజ్యోతి' నెలనెలా
పఠనం

వనితల
మనోభావాలను
ప్రతిబింబిస్తూ
మిమ్మలరిస్తున్న
ఉత్తమ శ్రేణి పత్రిక